ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
శుక్రవారం 22 నవంబరు 2024 | 5





ప్రత్యేక కథనం..6లో
దర్శనీయ ప్రాంతం ధనమ్మ మర్రి



ఆధునికీకరణ ఊసేలేదు..

టెండర్లు ఖరారు కాకుండానే హడావిడిగా..
ఆధునిక బస్‌స్టేషన్ పేరిట శంకుస్థాపన
ప్రయాణికులు ఫుల్లు.. సౌకర్యాలు నిల్లు
జిల్లా కేంద్రమైన అమలాపురం ఆర్టీసీ డిపో దుస్థితి

అమలాపురం టౌన్,(ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్రమైన అమలాపురంలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మిస్తామన్నారు. గత జగన్ ప్రభుత్వంలో సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ టెండర్లు ఖరారు కాకుండానే బస్ స్టేషన్ నిర్మాణానికి అప్పటి రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. కానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. శంకుస్థాపన శిలాఫలకాన్ని చూసి ప్రయాణికులు నవ్వుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఆర్టీసీ డిపో దుస్థితి ఇది..

మాటలు కోటలు దాటి..

విజయవాడ తరహాలో అత్యాధునిక వసతులతో జిల్లా కేంద్రమైన అమలాపురంలో నూతన ఆర్టీసీ బస్ కాంప్లెక్సు టెర్మినల్ నిర్మిస్తున్నట్టు నాటి రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ప్రకటించారు. ప్రాంగణంలో రూ.45 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో బస్ కాంప్లెక్సు టెర్మినల్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 14న సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావుతో కలిసి నాటి మంత్రి విశ్వరూప్ శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్సు భవనాన్ని తొలగించి దాన్ని స్థానే 24 ప్లాట్‌ఫారాలతో పాటుగా మూడు అంతస్తుల భవనాన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించనున్నట్టు ప్రకటించారు. శంకుస్థాపన చేసిన అనంతరం బస్ స్టేషన్ నిర్మాణానికి గానీ, ఆ వైపునకు గానీ వైసీపీ నాయకులు చూసిన దాఖలాలు లేవు.

సౌకర్యాలు నిల్



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ప్రస్తుతం జిల్లా కేంద్రాలుగా ఉన్న కాకినాడ, రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్ స్టేషన్లలో ప్రయాణికుల కోసం నిర్మించిన ప్లాట్‌ఫారాలన్నీ భవనాలుగానే ఉంటాయి. కానీ అమలాపురంలో 12 ప్లాట్‌ఫారాలు ఉన్నప్పటికీ అవన్నీ ఒక రేకుల షెడ్డు కిందే. నాటి నుంచి నేటి వరకు కొనసాగుతున్నాయి. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం డార్మెటరీ సదుపాయం కల్పించాల్సిన అవసరం కూడా ఉంది. ప్రయాణికులతో పాటు ఆర్టీసీ ఉద్యోగులకు సైతం సరైన సదుపాయాలు కల్పించలేని పరిస్థితి. ప్రస్తుతం బస్ స్టేషన్‌ను తొలగించి జిల్లా కేంద్రమైన అమలాపురం అధునాతన బస్ స్టేషన్ నిర్మించడంతో పాటు చుట్టూ వ్యాపార కూడలిగా తీర్చిదిద్దాల్సిన అవసరం కూటమి ప్రజాప్రతినిధులపైనే ఉంది. ప్రస్తుతం అక్కడ శంకుస్థాపన చేసేందుకు తీసిన గొయ్యి ప్రయాణికుల పాలిట శాపంగా.. ప్రమాద భరితంగా మారింది. రక్షణ చర్యలు చేపట్టినప్పటికీ అప్పుడప్పుడూ ఎవరో ఒకరు పడిపోతూనే ఉన్నారు. తక్షణం ఈ విషయంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఆవరణలో ఏర్పడిన భారీ గొయ్యి



బస్ డిపో..అధికారుల కార్యాలయాలూ ఇక్కడే..

అమలాపురం ఆర్టీసీ బస్ డిపోలో ప్రస్తుతం 145 బస్సులు ఉన్నాయి. రోజుకు 35వేల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు ప్రత్యేక ప్రాంగణమే ఉంది. ఇక డిపో మేనేజర్‌కు ప్రత్యేక కార్యాలయం ఉండగా జిల్లా కేంద్రమైన అమలాపురం ఆర్టీసీ డిపోలోనే ప్రస్తుతం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం కూడా కొనసాగుతుంది. ఆర్టీసీ బస్టాండు చుట్టూ ఎంతో విలువైన స్థలం ఉంది. వ్యాపారాత్మకంగా ఆ స్థలాన్ని వినియోగించుకుని ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది. ఇందుకోసం గత ప్రభుత్వాలు ఎన్నో ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి. ఆర్టీసీ సంస్థ ఆదాయం పొందడంలో ఎప్పటినుంచో అమలాపురం ఆర్టీసీ డిపోకు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత సైతం తన హవాను అమలాపురం డిపో కొనసాగిస్తూ ఆదాయంలో ముందంజలోనే ఉంది.

కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గిడ్డి



పి.గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోనసీమలోని వేలాది ఎకరాల్లో కొబ్బరి ఉత్పత్తి అవుతుందని కేరళ తరహాలో కోనసీమలోని అంబాజీపేట కేంద్రంగా కొబ్బరి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. కొబ్బరి రైతుల సమస్యలను గురువారం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటికే కొబ్బరి రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా అంబాజీపేటలో జరిగిన ప్రచార సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కొబ్బరి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ సందర్భంలోనే కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించేందుకుగాను కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి కొబ్బరి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరారు.

సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు అందించాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. ధరల స్థిరీకరణ, నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో గురువారం డీలర్లు, వర్తకులు, గణాంక అధికారులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంస్థాగత రిటైల్ దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధరల నియంత్రణలో భాగంగా అన్ని రైతు బజార్లలో వంటనూనెలు, కందిపప్పు, ఉల్లి, టమోటలను అందుబాటులో ఉంచి విక్రయించాలన్నారు. ప్రజలకు బియ్యం, కందిపప్పు, వంటనూనెను చౌకధరలకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతు బజార్లు సక్రమంగా పనిచేయకపోవడానికి గల కారణాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. రైతులు తాము పండించిన పంటలను విక్రయించుకునేందుకు రైతు బజార్లకు రావడం లేదని ఎస్టేట్ అధికారి వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 38 నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై నిత్యం సమీక్షిస్తుందని జేసీ వివరించారు. అధిక ధరలకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పామాయిల్ రూ.130, సన్‌ఫ్లవర్ రూ.145, బియ్యం సూపర్‌ఫైన్ రూ.55, మినపప్పు రూ.105, పెసరపప్పు రూ.110, వేరుశనగ నూనె రూ.150, కందిపప్పు రూ.148కి వినియోగదారులకు అందుబాటులో ఉంచామని ప్రతీ వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని జేసీ నిషాంతి తెలిపారు. ధరల నియంత్రణకు సంబంధించి అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయ భాస్కర్, జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి, డీలర్లు, గణాంక అధికారులు, కిరాణా షాపుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీతల హేచరీ స్థలం పరిశీలన



పరిశీలన చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

కాట్రేనికోన, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):చిర్రయానాంలో పసుపు పీతల హేచరీకి ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. హేచరీ ఏర్పాటు వల్ల వచ్చే ప్రయోజనాలపై ఆరా తీశారు. పసుపు పీతల పెంపకంపై మత్స్యకారులతో సంప్రదించారు. స్థానిక భౌగోళిక పరిస్థితులు పీతల పెంపకానికి అనువుగా ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. తమిళనాడు నుంచి పీతల సీడ్‌ను తీసుకురావడంలో నష్టాలు వస్తున్నాయని మత్స్యకారులన్నారు. 1300 కి.మీ రవాణా కారణంగా 50 శాతం పీత పిల్లలు చనిపోతున్నాయన్నారు. స్థానికంగా హేచరీ ఉంటే పీతల పెంపకం లాభదాయకంగా ఉంటుందని మత్స్యకారులు వివరించారు. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ బృందం ఇప్పటికే ఈ ప్రాంతంలో పర్యటించి, పీతల హేచరీకి ఇక్కడ అనుకూలమని నిర్ధారించినట్టు కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎఫ్‌డీవో సీహెచ్ గోపాలకృష్ణ, మత్స్య సహాయకులు లోవరాజు, బాలయోగి పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్?

అంబాజీపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో అవకతవకలపై చర్యలు

అంబాజీపేట, నవంబరు21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండల లెవెల్ సర్వీస్ పాయింట్ (ఎంఎల్ఎస్)లో అప్పటి ఇన్‌చార్జ్‌గా పనిచేసిన డి.శ్రీనివాసన్ అవకతవకలు పాల్పడ్డారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు గురువారం ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈయన ప్రస్తుతం సాధారణ బదిలీలలో భాగంగా రావులపాలెం తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 19వ తేదీన ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌లో దొంగలుపడ్డారు అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి డి.శ్రీనివాసన్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవం కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు అధికారకంగా ధ్రువీకరించాల్సి ఉంది.

విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్

డీఈవో సలీంబాషా



డీఈవో సలీంబాషా

అమలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా గురువారం తెలిపారు. ఆరో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సమస్యలను పరిగణలోనికి తీసుకుని వినూత్న పరిష్కారాలు రూపొందించడంతో పాటు అభివృద్ధి చేయడానికి స్కూలు ఇన్నోవేషన్ మారథాన్ ఒక అద్భుత వేదిక అని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా విద్యార్థుల ఆలోచనా శక్తి, పరిష్కార దృష్టి మరింత పెరుగుతుందన్నారు. ఇన్నోవేషన్ మారథాన్ ద్వారా ప్రదర్శించిన ప్రతిభావంతుల ప్రాజెక్టులు భవిష్యత్తు భారత్ సృష్టికి మేలుకొలుపుగా నిలుస్తాయన్నారు.

నెలాఖరు నాటికి పోస్టు సర్వే పూర్తిచేయాలి..

మారథాన్‌లో భాగంగా థీమ్ ఆధారంగా ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని డీఈవో తెలిపారు. ప్రతీ పాఠశాలలో కనీసం 30 మంది విద్యార్థులతో బృందాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయిందన్నారు. విద్యార్థులు తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డులను ఉపయోగించి స్కూలు ఇన్నోవేషన్ పోర్టల్‌లో లాగిన్ అవ్వాలన్నారు. ప్రతీ బృందం ప్రీ సర్వే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఎంచుకున్న ప్రాజెక్టులను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఆయా ప్రాజెక్టులను సంబంధిత ఉపాధ్యాయుడు ఆమోదించాలన్నారు. చివరిగా విద్యార్థులు పోస్టు సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియను నెలాఖరునాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ ఆలోచనలు అభివృద్ధి చేయడం, సృజనాత్మకతను మెరుగుపరచడానికి, సామాజిక సమస్యలపై వాస్తవిక పరిష్కారాలను అందించడానికి దోహదపడుతుందన్నారు. నెలాఖరు నాటికి విద్యార్థులు ప్రాజెక్టులను పూర్తిచేసి తమ ప్రతిభను చాటుకోవాలని డీఈవో కోరారు.

రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు?



మండపేట నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎంపిక దాదాపు ఖరారైనట్లు సమాచారం. బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఈ మేరకు ఓ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం సీఎం చంద్రబాబు నియామకానికి సంబంధించి అధికారిక ప్రకటన విడుదల చేస్తారని తెలిసింది. ఛైర్మన్ వేగుళ్లతో పాటు 8 మంది సభ్యులతో రాష్ట్ర అంచనాల కమిటీ ఏర్పడనుంది. ఈ కమిటీ రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలను పరిశీలిస్తుంది. మండపేట నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగు సార్లు టీడీపీ తరఫున విజయం సాధించిన వేగుళ్లకు తొలిసారి రాష్ట్రస్థాయి ఛైర్మన్ పదవి వరించనుంది. ఎమ్మెల్యే వేగుళ్ల 2009 నుంచి మండపేట నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. గతంలో వేగుళ్ల మండపేట మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందారు. 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన వేగుళ్ల 2009-11లో లెజిస్లేటివ్ సబార్డినేట్ కమిటీ సభ్యుడుగా, 2012-2013లో ఎస్టిమేట్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో అస్యూరెన్స్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఇప్పుడు కేబినెట్ హోదా పదవి ఎమ్మెల్యే వేగళ్లకు దక్కనుండటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

డిసెంబరు 31 వరకు పంటల బీమా గడువు

అమలాపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు సంబంధించి బీమా గడువు డిసెంబరు 31 వరకు ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. వరిసాగు ఎకరాకు రూ.680 చొప్పున ప్రీమియం చెల్లించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 23 నుంచి వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాలన్నారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు తెలియచేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందికి ఉందన్నారు. సమనస రైతు సేవా కేంద్రంలో గురువారం రాష్ట్రీయ కిసాన్ వికాస్‌యోజన పథకంలో భాగంగా ఉద్యాన పంటల్లో యాజమాన్య పద్ధతులపై అమలాపురం సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ (గ్రా)గామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు అన్ని పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు సూచనలు ఇచ్చే విధంగా శిక్షణలో మెలకువలు తెలుసుకోవాలన్నారు. మట్టి స్వభావాన్ని బట్టి పోషకాల లభ్యతను అనుసరించి ఎరువులను వినియోగించాలన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగాలను తెలియచేస్తూ రైతులు వాటిని వాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన అధికారి ఎం.శైలజ మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో అనుసరించే యాజమాన్య పద్ధతులు, చీడపీడలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ షంషీ, మండల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

బందారులంక పంచాయతీ కార్యాలయం వద్ద నాయకుల విగ్రహాలకు ముసుగులు





అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో ముసుగు వేయని విగ్రహాలు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు తీరిది..

అమలాపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కానీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయడం ఉంటుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ రాజకీయ పార్టీ కూడా ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో లేదు. అందరూ స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు. అయితే ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాలతో జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో రాజకీయ నాయకులు, మాజీ ముఖ్యమంత్రుల విగ్రహాలకు ముసుగులు వేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి రావడం వల్లే పంచాయతీ సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసినట్టు అమలాపురం ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు తెలిపారు. కానీ అమలాపురం పట్టణంలో ఏ ఒక్క రాజకీయ నాయకుని విగ్రహానికి ముసుగులు వేయనూ లేదు.. ఏ రాజకీయ నాయకుని ఫ్లెక్సులను తొలగించనూ లేదు. దీంతో అసలు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్టా లేనట్టా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

3 నెలల పింఛన్ ఒకేసారి..

ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

అమలాపురం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒకే సారి మూడు నెలలు పింఛన్ తీసుకునే వెసులుబాటును కల్పించాలని వృద్ధులు, దివ్యాంగులు, పెన్షన్‌దారులు కోరుకున్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూరల్ డెవలప్‌మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి.వీరపాండియన్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. మూడు నెలలకు ఒకేసారి శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ఈ వార్తా కథనం ప్రచురితమైంది. వృద్ధులు, దివ్యాంగులు, పెన్షన్‌దారులు కోరుకున్న విధంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనకు అనుగుణంగా ఉత్తర్వులు విడుదల చేశారు. డిసెంబరు 1 నుంచి పెన్షన్ తీసుకునే పెన్షన్‌దారులందరికీ ఈ విధానం వర్తించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిసెంబరులో పెన్షన్ పొందనివారు 2025 జనవరిలో రెండు నెలల పెన్షన్ మొత్తాన్ని పొందవచ్చు. జనవరిలో కూడా అందుబాటులో లేకపోతే ఫిబ్రవరిలో మూడు నెలల పెన్షన్ సొమ్ములు తీసుకోవచ్చు. అయితే వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోని లబ్ధిదారుని పేరు నాల్గో నెలలో బట్వాడా యాప్‌లో కనిపించదని ఉత్తర్వుల్లో తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో పెన్షన్‌దారుడు సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్, ఎంపీడీవో ద్వారా తన పేరును తిరిగి పునరుద్ధరించుకునేందుకు తెలియచేయాల్సి ఉంటుంది. మూడు నెలలు లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, అర్హతను బట్టి ఉన్నతాధికారులు పెన్షన్‌ను పునరుద్ధరిస్తారన్నారు. అయితే గత నెలల బకాయిల సొమ్ములు మాత్రం విడుదల కావని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సైతం ఇదే విధానాన్ని కొనసాగించారు. వివిధ కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్నవారు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు, పెన్షన్‌దారులకు నిజంగా ఇది శుభవార్తే. పెన్షన్ల పంపిణీపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖతో పాటు మండల పరిషత్, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలందాయి.

మీ అమ్మాయి అరెస్ట్ అయ్యిందంటూ ఫోన్‌కాల్..
డబ్బులు దోచేందుకు సైబర్ నేరగాళ్ల ప్లాన్ విఫలం 7లో



ఊడలతో విస్తరించిన ధనమ్మమర్రి

'కార్తీకం'లో సందర్శనీయ ప్రాంతం..

ధనమ్మమర్రి



భక్తులకు దర్శనమిచ్చే ధనమ్మ తల్లి

- సహపంక్తి భోజనాలకు ప్రతీతి
- కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ధనమ్మతల్లి
- గోదావరి వరద నుంచి రక్షించాలని ముడుపులు
- సంతాన ప్రాప్తికి పసుపు ఊయలలు.. భక్తుల విశ్వాసం
- కార్తీక మాసంలో విందు, వినోదాలకు నిలయం



విందు భోజనాల కోసం ఏర్పాటు చేసిన రేకులషెడ్

కపిలేశ్వరపురం/(ఆంధ్రజ్యోతి):

అదొక ఆహ్లాదకర ప్రాంతం.. సహపంక్తి భోజనాలకు ఎంతో ప్రసిద్ధిగాంచింది. అక్కడ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ధనమ్మ తల్లిగా ఉంది. గోదావరి వరద నుంచి రక్షించాలని ఆ మర్రిచెట్టు కు భక్తులు ముడుపులు, సంతాన ప్రాప్తికి పసుపు ఊయలలు కడతారు.. కార్తీకంలో విందు, వినోదాలకు నిలయంగా నిలుస్తోంది. అదే మన ధనమ్మమర్రి..!.. ఈ ప్రాంత ప్రత్యేకత గురించి తెలుసుకుందాం..



మర్రిచెట్టుకు కట్టిన ముడుపులు

గౌతమీ నదీతీరాన వెలసిన ధనమ్మతల్లి

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, ఆడపడుచులకు ఆరాధ్యదైవంగా నీరాజనాలు అందుకుంటున్న శ్రీధనమ్మతల్లి అమ్మవారికి ఎంతో చరిత్రఉంది. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక, వీధివారిలంక గ్రామాల మధ్య పావన గౌతమీ నదీతీరాన ఒక మర్రి చెట్టు ఉంది. ఈ చెట్టు కింద మూడు దశాబ్దాల క్రితం ధనమ్మతల్లి అమ్మవారు వెలిసిందని ప్రజల ప్రగాఢ నమ్మకం. ఆనాటినుంచి ఈప్రాంతం ధనమ్మమర్రిగా వాడుకలోకి వచ్చింది.

ఆదివారాల్లో సందర్శకుల తాకిడి

ధనమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఏటా వైశాఖ శుద్ధ ద్వాదశి నుంచి నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు కపిలేశ్వరపురం వంశస్థులు అమ్మవారికి సారె, చీరలు పంపడం ఆనవాయితీగా మారింది. యాత్రికులు సమర్పించే కానుకలతోనే నిత్య ధూప, దీప నైవేద్యాలు, ఉత్సవ నిర్వహణ జరుగుతుంది. దివంగత మాజీ కేంద్రమంత్రి ఎస్‌బీపీబీకే సత్యనారాయణ రావు విందులకు వచ్చే సందర్శకుల కోసం మం చి నీటి సౌకర్యం, వంటశాలలు, నామమాత్రపు అద్దెతో వంటసామాగ్రి ఏర్పాటు చేయించారు. కార్తీకమాసంలో ధనమ్మమర్రి భక్తులతో కిటకిటలాడుతుంటుంది. ప్రతి ఆదివారం సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది.

మర్రిచెట్టు ఊడలతో..

కపిలేశ్వరపురం జమిందారు దివంగత బలుసు బుచ్చి సర్వారాయుడు వంశానికి చెందిన లంక భూమిలో ఈ మర్రిచెట్టు ఊడలతో విస్తరించి ఉంది. యాంత్రికమైన జనజీవనానికి ఆటవిడుపునిచ్చే విందు, వినోదాలు కాగా వాటికి విడిదిగా ప్రత్యేక ఖ్యాతి నార్జించింది ఈ ధనమ్మమర్రి. ఈ ప్రాంతం ఒకప్పుడు భక్తిప్రపత్తులకు మాత్రమే ఆలవాలంగా ఉండగా ఇప్పుడు అన్నిరకాల విందు, వినోదాలకు నిలయంగా మారింది. ఈ మధ్య కాలంలో ఇక్కడ పలువురు ఆకతాయిలు తీరు ఒక్కోసారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉండడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ వరద గోదావరి నుంచి లంక పంటలను, బాలారిష్టాల నుంచి పిల్లలను రక్షించి పశుసంపద సమృద్ధిగా ఉండాలని అమ్మవారికి గ్రామస్థులతోపాటు యాత్రికులు ముడుపులు, మొక్కుబడులు చెల్లిస్తుంటారు. సంతాన ప్రాప్తి కలిగించమని పసుపు ఊయలలు కడతారు. బంధుగణాలతో సహపంక్తి భోజనాలు చేస్తుండడం అనాదిగా సాగుతోంది. అమ్మవారిని దర్శించడానికి లంక గ్రామాలతోపాటు పరిసర మండలాలైన కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, మండపేట, సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.



రాయవరంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

క్రీడా కోటా..

ఇకపై 3%

- 1శాతం పెంచిన కూటమి ప్రభుత్వం
- క్రీడాకారులకు ప్రోత్సాహం
- ప్రభుత్వ ఉద్యోగాలకు సులువైన మార్గం
- క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు

క్రీడల్లో రాణిస్తే చాలు.. మంచి అవకాశాలు లభించనున్నాయి. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల్లో క్రీడా కోటాను 3శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గతంలో 2శాతంగా ఉన్న ఈ కోటాను ఇప్పుడు 1శాతం పెంచడంతో 3శాతానికి పెరిగింది. దీంతో క్రీడారంగంలో రాణించే వారికి మేలు జరగనుంది. దీనివల్ల క్షేత్రస్థాయిలో క్రీడా పోటీలకు హాజరయ్యేవారికి మంచి అవకాశాలు లభించనున్నాయి. ఈ నిర్ణయంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలనుంచి అనేకమంది క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తున్నారు. రాష్ట్ర జాతీయస్థాయికి ఎంపికవుతూ.. కొందరు అంతర్జాతీయ స్థాయిలోను సత్తాచాటుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం క్రీడకారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. నగరాలతోపాటు గ్రామీణప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులు వారిలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వారిని తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వైసీపీ హయాంలో కనీస సౌకర్యాలు కల్పించపోవడంతో క్రీడాకారులకు ప్రోత్సాహాలు లేకపోయాయి. కూటమి ప్రభుత్వం తిరిగి క్రీడలకు పూర్వవైభవం కల్పించి క్రీడాకారులను ప్రోత్సాహం అందజేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగాల్లో క్రీడాకారుల కోటాను పెంచడంతో క్రీడలు మరింత అభివృద్ధి చెందడంతోపాటు క్రీడాకారులు అన్నిస్థాయిల్లోను రాణించడానికి ఎంతగానో ఉపకరిస్తుందని అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఇప్పటివరకు క్రీడాకారులకు ఉద్యోగాల్లో ఉన్న రెండు శాతం ఉన్న క్రీడాకోటాను 3శాతానికి పెంచారు. గ్రామీణప్రాంతాల్లో అనేకమంది విద్యార్థులు ఇటీవల క్రీడల్లో రాణిస్తున్నారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, అథ్లెటిక్స్ బాల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ వంటి క్రీడల్లో తమ సత్తా చాటుతున్నారు. పాఠశాలల్లో పీఈటీల ద్వారా శిక్షణ పొంది తమలోని నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నూతన క్రీడా విధానంతో క్రీడలకు పూర్వ వైభవం వస్తుందని పలువురు క్రీడా నిపుణులు భావిస్తున్నారు.

మాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది



చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపుతూ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం పెంచిన 3శాతం కోటాతో మాకు క్రీడల్లో మరింత రాణించాలనే ఉత్సాహం కలుగుతోంది.

-కాకి రమ్యశ్రీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడల్లో 3శాతం కోటాను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలి. ఈ నిర్ణయంతో పాఠశాలస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను తీర్చిదిద్దడానికి మరింత అవకాశం కలిగింది.

-కృష్ణప్రసాద్, పీఈటీ వెదురుపాక(రాయవరం)

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఐదుగురు అభ్యర్థులు
- వచ్చేనెల 5న పోలింగ్.. 9న ఓట్ల లెక్కింపు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణలు గురువారం ముగిశాయి. ఒకే ఒక్క అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ చేసుకోగా ఎన్నికలబరిలో ఐదుగురు అభ్యర్థులు నిలిచారు. ఎన్నికల బరిలో నిలిచినవారిలో బుర్రా గోపీమూర్తి, గంథం నారాయణ రావు, నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్ ఉన్నారు. ఇకనుంచి వీరు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవ్వనున్నారు. వచ్చేనెల 5న పోలింగ్ జరగనుంది. 9న కౌంటింగ్ జరగనుంది. దీనికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. మొత్తంగా 16,316మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2893మంది , ఏలూరు జిల్లాలో 2605మంది, కాకినాడ జిల్లాలో 3333 మంది, కోనసీమ జిల్లాలో 3209మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో 3662మంది ఓటర్లు ఉన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలు ఉండగా, దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

బోగన్‌విలియా... అందాలు!

కడియం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పూలు అన్నా.. మొక్కలు అన్నా అందరికీ ఇష్టమే. అటువంటి మొక్కల పుట్టినిల్లు కడియం. కడియం నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు మనకు లభ్యమవుతాయి. మనకు ఫొటోల్లో కనిపిస్తున్నవి బోగన్‌విలియా.. వీటినే కాగితం పూలు అని కూడా అంటారు. ఇంటిముందు, లాండ్ స్కేపింగ్‌లో అలంకరణకు ఎక్కువగా వీటిని వాడుతుంటారు. ఇనుప ఊచలను వివిధ ఆకృతుల్లో తయారు చేసి ఈ మొక్కలకు వాటిపై పాకిస్తూ తీర్చిదిద్దుతారు. ప్రస్తుతం సుందరీకరణలో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ బోగన్‌విలియా పూలమొక్కలు ఎరుపు, తెలుపు, పసుపు, నీలం, వైలెట్ వంటి రంగుల్లో విడివిడిగా పలు రంగుల కలిసి ఒకే మొక్కగా కడియం నర్సరీల్లో ఇలా కొలువుతీరి ఉన్నాయి.





తూర్పుగోదావరి జిల్లాలోని కడియం నర్సరీల్లో రకరకాల రంగుల్లో కనువిందు చేస్తున్న బోగన్‌విలియా మొక్కలు.. అదేనండీ.. కాగితం పూల మొక్కలు

సాఫ్ట్‌బాల్ పోటీలకు పెద్దాపురప్పాడు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

కరప, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడు హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం హైస్కూల్ క్రీడాప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక పక్రియ జరిగిందని గురువారం వారు తెలిపారు. అండర్-14 విభాగంలో బాలురజట్టుకు పాఠశాలనుంచి ఎస్.నాగేంద్ర, బి.అంజనీకుమార్, బాలికల జట్టుకు సీహెచ్.విజయలక్ష్మి, కె.అనురాధ ఎంపికయ్యారన్నారు. చిత్తూరుజిల్లా అరకొండలో ఈనెల 22వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల తరపున వీరు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. అండర్-17 విభాగంలో బాలుర జట్టుకు వై.సుధీర్, డి.సూర్యవెంకటమణికంఠ, జి.వీరమణికుమార్, బాలికల జట్టుకు కె.సంధ్యారాణి ఎంపికయ్యారన్నారు. అనంతపురంలో ఈనెల 23 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల నుంచి వీరు బరిలోకి దిగుతారని వివరించారు. క్రీడాకారులను, పాఠశాల పీడీ ప్రసాద్‌లను హెచ్ఎంతోపాటు సర్పంచ్ బిరుదా సరస్వతి, ఉపసర్పంచ్ శ్రీనివాసఅప్పారావు, విద్యాకమిటీ చైర్మన్ యాళ్ల నాగబాబు అభినందించారు.

పీసా చట్టం అమలుపై ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు పొందుతున్న శిక్షణార్థులు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో రెండురోజులుగా నిర్వహిస్తున్న గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టం అమలుపై ప్రభుత్వం నిర్దేశించిన మేరకు చట్టం అమలులో నిష్ణాతులు ఇచ్చిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పీసా చట్టం 1996లో కేంద్రప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ చట్టాన్ని అమలు చేసేందుకు గ్రామ పరిపాలనా వ్యవస్థలో ఈచట్టం ఆవశ్యకతను సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జేడీలు రమణ, రామనాథం మాట్లాడుతూ పీసా చట్టం అమలుకు పంచాయతీరాజ్‌శాఖ, గిరిజనశాఖ, జీసీసీ, ఎక్సైజ్‌శాఖ, పోలీసుశాఖలు భాగస్వాములు కావాలన్నారు. ఫ్యాకల్టీలు సీతారామారావు, వి.ప్రసాద్, కేఆర్ నీహారిక, బి.ఆంజనేయులు, డీఆర్ఎల్ పద్మరాజు ప్రసంగించారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

'బాలికల సంరక్షణకు అందరూ భాగస్వాములవ్వాలి'

- ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి

సామర్లకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు సమాజంలో అందరూ భాగస్వాములవ్వాలని, ఇందుకు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అన్నారు. సామర్లకోట టీటీడీసీ ఆవరణలో గురువారం కిశోర వికాసం పేరిట కాకినాడ జిల్లాస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని పీడీ శ్రీరమణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐసీడీఎస్ కాకినాడ జిల్లా పీడీ కె.ప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి మాట్లాడారు. కిశోరబాలికల సంరక్షణకు ఆరుశాఖలను మిళితం చేశారని, ఇందుకు జిల్లాస్థాయి రీసోర్సు గ్రూపుల ద్వారా మండల రీసోర్సుగ్రూప్‌లకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లని బాలికలను గ్రూపులుగా మహిళా పోలీసు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కిశోర బాలికా వికాసం కార్యక్రమానికి సంబంధించి నవంబరు 30లోగా విలేజ్ రీసోర్సు గ్రూపులకు మండల రీసోర్సు శిక్షణలు పూర్తి చేయాలన్నారు. డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీరమణి మాట్లాడుతూ కిశోర వికాసం కోసం ఏర్పాటు చేసిన గ్రూపులు ప్రతి 15రోజులకు ఒకసారి(రెండో, నాలుగో శనివారాల్లో) అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశం అవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రవీణ మాట్లాడుతూ లింగవివక్షత, సంపూర్ణ ఆహారం-ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపులనుంచి రక్షణ, బాల్యవివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యం ఉపాధి వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ అంకబాబు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ వెంకట్, శ్రీనివాస్‌లు ప్రసంగించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సూర్య ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ప్రసంగించారు. బాలలకు ఆపద సమయంలో 1098, 112 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించి రక్షణ పొందవచ్చని చారిటబుల్ ట్రస్ట్ తరపున చిరంజీవి విజయలక్ష్మి పప్పెట్‌లతో కూడిన సందేశాన్నిచ్చారు. శిక్షణ తరగతుల్లో పలు ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు ఉషా, దుర్గాదేవి, శ్రీలలిత, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలు పూర్తికి చర్యలు

- వచ్చేనెల 6నుంచి ఇంటర్మీడియట్‌కు రెండు పూటలా తరగతులు
- విద్యాశాఖ ఆర్‌జేడీ శారద



ఆర్‌జేడీ శారదను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పిఠాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో ఆసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ఐ.శారద తెలిపారు. గురువారం ఆమె కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో బోధన జరుగుతున్న తీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలలో నాబార్డు ద్వారా చేపట్టిన కళాశాల భవనాలు మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని ప్రిన్సిపాల్ కేశవరావు, కళాశాల పీటీఏ చైర్మన్ విజయకుమార్ తదితరులు ఆర్‌జేడీ దృష్టికి తీసుకువచ్చారు. దీనితో ఆమె అక్కడినుంచే ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృతికాశుక్లాతో ఫోన్‌లో మాట్లాడారు. కళాశాల ఎక్యులేటెడ్ పీ ఫండ్ నుంచి రూ.30.5లక్షలతో అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేయించేందుకు డైరెక్టర్‌తో అంగీకరింప చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు పూర్తయినందున త్వరితగతిన సొంత భవనాల్లోకి వెళ్లాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఇంటర్మీడియట్ తరగతులను డిసెంబరు 6వ తేది నుంచి రెండు పూటలా తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. అనంతరం ఆర్‌జేడీని ప్రిన్సిపాల్ తదితరులు సత్కరించారు.

108 శివలింగాలతో 25న పాదగయలో లక్షార్చన

పిఠాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో ఈనెల 25వతేదీ రాత్రి 108 శివలింగాలతో లక్షార్చనపూజ నిర్వహించనున్నారు. ఘనాపాఠి ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ పూజా కార్యక్రమాల్లో భాగంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని శివస్వాముల భక్త బృందం సభ్యులు తెలిపారు. శివస్వాములతోపాటు అయ్యప్ప, దత్తస్వాములు, ఇతర మాలదారులు ఈ పూజల్లో పాల్గొనాలని వారు కోరారు.

అంతర్వేదిలో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పూజలు



రమేష్‌బాబుకు స్వామి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అంతర్వేది, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దేవదాయ, ధర్మదాయశాఖ కాకినాడ డిప్యూటీ కమిషనర్ డీవీవీ రమేష్‌బాబు గురువారం విచ్చేశారు. ఆయనకు ఆలయ ఏసీ, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులతో మహదాశీర్వచనం జరిపించారు. వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఏసీ సత్యనారాయణ అందించారు.



రమణ దీక్షితులును సత్కరిస్తున్న పోలరాజు

శివాంజనేయ నర్సరీని సందర్శించిన రమణ దీక్షితులు

కడియం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని శివాంజనేయ నర్సరీని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ప్రధానార్చకుడు రమణ దీక్షితులు గురువారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు మొక్క అందజేసి స్వాగతించి సత్కరించారు. రమణ దీక్షితులు నర్సరీలో వివిధ రకాల మొక్కలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. కొన్ని రకాల ఆయుర్వేద మొక్కల గురించి అడిగారు. బోన్సాయ్ మొక్కలను చూసి అబ్బురపడ్డారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

సిద్ధి వినాయకుని హుండీల ఆదాయం రూ.29.70 లక్షలు

అయినవిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో హుండీలను గ్రేడ్-1 పర్యవేక్షణాధికారి ఎం.రాధాకృష్ణ ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.28,57,346, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.1,13,365.. మొత్తం రూ.29.70 లక్షలు వచ్చిందన్నారు. బంగారం 7 గ్రాములు, వెండి 743 గ్రాములు, 19 విదేశీ కరెన్సీ లభించాయని ఆలయ సహాయ కమిషనరు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. లెక్కింపులో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.




స్వామీజీకి చిత్రపటం అందజేస్తున్న సహాయ కమిషనర్ సత్యనారాయణ

లక్ష్మీనరసింహుని సన్నిధిలో

మేల్కోట క్షేత్రాధిపతి

అంతర్వేది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కర్ణాటక రాష్ట్రం మేల్కొట క్షేత్రాధిపతి త్రిదండి శఠగోపమునిరామరాజ్ జీయర్‌స్వామి గురువారం విచ్చేశారు. ఆయనకు ఆలయసహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్యులు రామరంగాచార్యులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని జీయర్‌స్వామికి అందించారు.



పోలీస్ గెటప్‌లో ఉన్న ఫొటోతో వచ్చిన వాట్సాప్ కాల్

కరప తరహాలో ఘరానా మోసం

మీ కుమార్తెను అరెస్ట్ చేశామంటూ వాట్సాప్ కాల్‌తో బెదిరింపు

తండ్రి గట్టిగా ప్రతిఘటించడంతో తోక ముడిచిన సైబర్ మోసగాడు

పి.గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప గ్రామంలో సైబర్ ఘటన జరిగి రెండు రోజులు గడవక ముందే డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో అదే తరహాలో అదే పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న ఫొటోతో వాట్సాప్ కాల్ ద్వారా..... మీ కుమార్తెను అరెస్ట్ చేశామని తండ్రి మొబైల్‌కు ఫోన్ చేసి బెదిరించాడు ఓ సైబర్ మోసగాడు. వివరాలు ఇలా ఉన్నాయి... గన్నవరం గ్రామానికి చెందిన బోరుసు చంద్రశేఖర్ దంపతులు హైదరాబాద్‌లో ఒక వివాహ వేడుకకు హాజరై గురువారం ఉదయం ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఉదయం 9.45 గంటల సమయంలో పోలీస్ యూనిఫామ్, వెనుక పోలీస్ స్టేషన్ సెటప్‌తో కూడిన ఫొటోతో చంద్రశేఖర్‌కు వాట్సాప్ కాల్ వచ్చింది. మొదటిసారి తియ్యకపోవడంతో మళ్లీ కాల్ వచ్చింది. ఫోన్ తియ్యగానే క్రైమ్ బ్రాంచ్ నుంచి సీబీఐ అధికారిని మాట్లాడుతున్నానని చెప్పాడు. రాజమహేంద్రవరంలో డెంటల్ కాలేజీలో పీజీ చేస్తున్న ఆయన కుమార్తె పేరు చెప్పి అరెస్ట్ చేశామని, ప్రస్తుతం మా వద్ద ఉందని సైబర్ మోసగాడు చెప్పాడు. దీంతో కంగుతున్న చంద్రశేఖర్ ఇదేంటి గంట క్రితమే కుమార్తెతో మాట్లాడాను కదా అప్పుడే అరెస్ట్ అంటున్నారేంటి అనుకుని ఒక్క క్షణం దిగ్భ్రాంతికి గురై అనంతరం ఫోన్‌లో గట్టిగా ప్రతిఘటించాడు. దీంతో ఆ సైబర్ మోసగాడు ఫోన్ కట్ చేసి తోక ముడిచాడు. కాగా వీరిద్దరి మధ్య సంభాషణ ఇంగ్లీషులోనే జరిగింది. ఈ రకమైన ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు చెప్తున్నారు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే ఇబ్బందిపడతారని హెచ్చరిస్తున్నారు.

భావనారాయణస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు

హర్షవర్ధన్

సర్పవరం జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామిని ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ గురువారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. ఆలయంలోని పలు పురాతన ప్రాంతాలను సందర్శించారు. ఆలయ విశిష్టత, చరిత్రను అధికారులు వివరించారు. ప్రసాదం, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



గిరిజన రైతులతో కలిసి కోసిన పత్తిని చూపిస్తున్న విదేశీ శాస్త్రవేత్తలు

మన్యంలో నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు

ప్రకృతి వ్యవసాయంపై పరిశోధన

చిన్నయపాలెంలో పత్తి సాగు పరిశీలన

రాజవొమ్మంగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుపై పరిశోధన చేస్తున్న నెదర్లాండ్స్ దేశానికి చెందిన అవన్స్ యూనివర్సిటీ శాస్త్రవేతల బృందం గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో పర్యటించింది. చిన్నయపాలెం గ్రామంలో రాడీస్ సంస్థ ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా గిరిజన రైతు గూడెం బాలమ్మ సాగు చేస్తున్న పత్తి పంటను శాస్త్రవేత్తలు కరిన్ జసీన్, తహసీమార్క్, టిమీర్ మన్స్, ఎల్స్‌డిరిద్దర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాడీస్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ శాస్త్రవేత్తల బృందానికి వివరించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పత్తి సాగు చేసే ఎకరంలోనే అంతర పంటలుగా బొబ్బర్లు, కందులు, చోళ్లు పండించడంపై శాస్త్రవేత్తలు ప్రత్యేక ఆసక్తి కనబర్చారు. పంటలకు చీడపురుగులు పట్టకుండా పొలం చుట్టూ వేసిన ఆముదం మొక్కలను పరిశీలించారు. గిరిజన రైతులతో కలిసి పత్తిని తీశారు.

ఇద్దరు దారి దోపిడీ దొంగల అరెస్టు

31.5 గ్రాముల బంగారపు వస్తువులు, ఐదు వేల నగదు స్వాధీనం



అరెస్టు చేసిన నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాత్రి వేళ దారిదోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నేరస్తుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో డీఎస్పీతో పాటు భీమడోలు సీఐ యుజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ పి.సుధీర్ పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఆలూరి శాంతకుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీ రాత్రి భీమడోలులో ఉన్న తన భార్య వద్దకు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. మార్గమధ్యంలో ద్వారకాతిరుమల మండలం కప్పలగుంట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గల ఒక కల్వర్టు వద్ద ఆగాడు. అక్కడ పొలాల్లో దాగి ఉన్న ఇద్దరు యువకులు అకస్మాత్తుగా దాడి చేసి 10 వేల రూపాయల నగదు, సెల్‌ఫోన్, బంగారపు ఉంగరాలను లాక్కొని అతని కాళ్లు, చేతులు కట్టి చెట్ల పొదల్లో పడవేసి పారిపోయారు. ఈ సంఘటనపై ద్వారకా తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఈ దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి ఐదు వేల రూపాయల నగదు ఒక బంగారపు ఉంగరం, టార్చిలైట్, ఈ నేరానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేశారు. అరెస్టు అయిన నిందితులు రాజమహేంద్రవరం కొంతమూరులోని జంగాలకాలనీకి చెందిన మానిపాటి విజయ్‌కుమార్ (24) రాజమహేంద్రవరంలోని చింతల నామవరానికి చెందిన రామిరెడ్డి త్రిమూర్తులును అరెస్టు చేశామన్నారు. మానిపాటి విజయ్ కుమార్ అనేక దోపిడీలు, దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు నిందితుల నుంచి 31.500 గ్రాముల బంగారం (ఏడు ఉంగరాలు, రెండు గొలుసులు) ఒక టార్చిలైటు, ఐదు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అరెస్టు చేసిన పోలీసుల్ని ఎస్పీ అభినందించారు.

అన్నవరం దేవస్థానంలో నిత్య హరినామ సంకీర్తనలు ఏర్పాటు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భజన సమ్మేళన బృందం సభ్యులు

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాదిరిగా అన్నవరం దేవస్థానంలో నిత్య హరినామ సంకీర్తనల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కాకినాడ జిల్లా భజన కళాకారుల సంఘం కన్వీనర్ సాన నూకరాజు డిమాండ్ చేశారు. ప్రతి నిత్యం నాలుగు భజన బృందాలకు అవకాశం కల్పించి వారికి టీఏ, డీఏలతో పాటు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. అంతకు ముందు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామీజీ ఆధ్వర్యంలో సుమారు 100 మంది ఆధ్యాత్మిక భజన సమ్మేళనం నిర్వహించి డిసెంబరు 11న జరిగే గీతా జయంతికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వామి నిర్భయానంద గురూజీ పాల్గొన్నారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన పుట్టా గనిరాజు రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఏఈవో కొండలరావుకు అందించారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదం అందజేశారు.



ఏఈవో కొండలరావుకు విరాళం అందజేస్తున్న దాత గనిరాజు



సత్యదీక్షాపరుల ఇరుముడి సమర్పణకు ఏర్పాటుచేసిన హోమ గుండం

నేడు రత్నగిరిపై సత్య అనుగ్రహ పూజ

రేపు సత్య దీక్షల విరమణకు ఏర్పాట్లు పూర్తి

సత్యదీక్షాపరులందరికీ ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రతాలు

అన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు సత్య అనుగ్రహ (పడి) పూజ నిర్వహణకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సత్యదేవుని వార్షిక కల్యాణ మండపంలో నిర్వహించే పూజలో సత్యదీక్షాపరులు, అయ్యప్పమాలధారులు పాల్గొననున్నారు. స్వాములంతా కల్యాణ వేదిక ఎదురుగా కూర్చునేందుకు బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆరు గంటలకు ప్రారంభమయ్యే పడి పూజ రాత్రి 10.30 వరకు జరుగుతుంది. దీక్షాపరులందరికీ దేవస్థానం ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. శనివారం సత్యదీక్షల విరమణకు సంబంధించి పనులు వేగవంతమయ్యాయి. గిరిజన ప్రాంతంలో పవనగిరి స్వామీజీ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టిన వారు, సత్యదీక్ష ప్రచారకర్త కృష్ణబాబు ఆధ్వర్యంలో దీక్ష తీసుకున్న వారు శుక్రవారం రాత్రి అన్నవరం చేరుకుంటారు. సత్యదీక్షాపరులు అందరూ వార్షిక కల్యాణ మండపంలో ఇరుముడులు సమర్పించాలి. దీనికి సంబంధించి కల్యాణ వేదికను ఆనుకుని ప్రత్యేక హోమ గుండం ఏర్పాటు చేశారు. సత్యదీక్షలు విరమించే అందరికీ సత్యనారాయణ స్వామి ఉచిత సామూహిక వ్రతాల నిర్వహణకు ప్రత్యేకంగా రెండు వ్రత మండపాలను అందుబాటులో ఉంచినట్టు ఆలయ సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు చెప్పారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిలక్

దుబాయ్ వెళ్లి అప్పులపాలు...

తీర్చేందుకు చోరీల బాట

తొలి చోరీ సక్సెస్ కావడంతో మరో చోరీకి యత్నం

నిడదవోలు పోలీసుల నిఘా.. ముగ్గురి అరెస్టు

నిడదవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అప్పులు చేసి దుబాయ్ వెళ్లారు... అక్కడ కలిశారు... ఒకరి కష్టాలు ఒకరికి చెప్పుకుని స్నేహితులుగా మారారు.. ఇండియా వచ్చాక ఆ అప్పులు తీర్చుకునేందుకు దొంగతనాలకు తెరలేపారు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారం చోరీ చేసిన కేసులో పోలీసులకు చిక్కి జైలుకెళ్లారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన చెల్లుబోయిన సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన పాకా వీరాస్వామి అప్పులు చేసి దుబాయ్ వెళ్లారు. అక్కడ ఇద్దరూ ఒకే రూమ్‌లో కలిసి ఉండేవారు. దీంతో స్నేహితులయ్యారు. దుబాయ్‌లో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఇటీవల తిరిగి ఇండియాకు వచ్చేశారు.. అయితే అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. మరోవైపు చెడు వ్యసనాలు.. దీంతో పాకా వీరాస్వామి ఉల్లిపాయల వ్యాపారం మొదలెట్టారు. ఈ నెల 6వ తేదీన నిడదవోలు గాంధీనగర్‌లో ఒక వృద్ధురాలు ఒంటరిగా నివసించడం గమనించాడు. ఈ విషయం స్నేహితుడు సత్యనారాయణకు చెప్పాడు. వృద్ధురాలిపై దాడి చేసి బంగారం ఎత్తుకుపోయేలా ప్లాన్ వేశారు. ఇందుకు పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలానికి చెందిన మరో స్నేహితుడు సమ్మింగి సన్యాసిరావు సహాయం తీసుకున్నారు. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు నూలి అన్నపూర్ణమ్మపై ఈ నెల 8వ తేదీన దాడి చేసి బంగారం దోచుకుపోయారు. ఇది సక్సెస్ కావడంతో బుధవారం మళ్లీ మరో నేరం చేయడానికి ప్రణాళిక వేసేందుకు నిడదవోలు రాగా పోలీసుల నిఘా ఉంచి పట్టుకున్నారు. చోరీ చేసిన బంగారాన్ని సీఐ తిలక్, ఎస్ఐ శోభన్‌కుమార్ రికవరీ చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు.



రేషన్ బియ్యం అక్రమాలను మంత్రికి వివరిస్తున్న టీడీపీ నాయకుడు శ్రీకాంత్

రేషన్ బియ్యం దందాపై

చర్యలు తీసుకోండి

పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు ఫిర్యాదు

ఎటపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్ కేంద్రంగా సాగుతున్న రేషన్ బియ్యం దందాపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు టీడీపీ నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, గడేసుల రంజిత్ ఫిర్యాదు చేశారు. గురువారం వారు అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిశారు. నాలుగు విలీన మండలాలతో పాటు తెలంగాణలోని భద్రాచలం నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా చింతూరు తరలిస్తున్నారని... అక్కడి నుంచి రాజమహేంద్రవరం, కాకినాడలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కొన్ని రకాల రసాయనాలతో పాలిష్ చేస్తూ బ్లాక్ మార్కెట్‌లో కిలో రూ.60 నుంచి రూ.70 వరకు వరకు విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. దీనికి స్పందించిన మంత్రి మనోహర్ విచారణకు ఆదేశించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు శ్రీకాంత్ చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నలజాల శ్యామ్ వున్నారు.

'అపార్' అప్డేషన్‌పై

డీఎల్డీవో సమీక్ష

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలో అపార్-ఆధార్ అప్డేషన్‌పై అమలు తీరుపై డీఎల్డీవో పి.వాసుదేవరావు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం సమీక్షించారు. ఎంపీడీవో హిమమహేశ్వరి, ఎంఈవోలు పుల్లయ్య, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు. ఎస్సీసీఐ ఇంటింటా జియో ట్యాగింగ్ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మం డలంలో వివిధ పథకాల అమలు తీరుపై డీఎల్డీవో వాసు దేవరావుకు ఎంపీడీవో హిమమహేశ్వరి వివరించారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

యానాం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానికరాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రాంతీయ స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను పరిపాలనాధికారి మునిస్వామి, విద్యాశాఖాధికారి వంపన ప్రవీణ్ ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనలను అతిథులు తిలకించారు.

మహిళల రక్షణపై అవగాహన

అల్లవరం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మహిళా సంరక్షణపై ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఓడలరేవు, గోడిలంక జడ్పీ హైస్కూల్స్‌లో అవగాహన సదస్సులు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. మహిళా చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు మల్లాడి మంగాయమ్మ, రుద్రరాజు పవిత్రలక్ష్మిపతిరాజు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాంటీ మైక్రో బయల్ రెసిస్టెన్స్‌తో ముప్పు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పశుసంవర్థకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి

అమలాపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కంటికి కనిపించని సూక్ష్మాతి సూక్ష్మమైన బ్యాక్టీరియా వైరస్‌లు, ఫంగస్‌లు మానవ శరీరం లోపలా, బయటా ఉంటాయని, వీటిని మైక్రోబ్స్ అని పిలుస్తారని అమలాపురం పశుసంవర్థకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి పేర్కొన్నారు. జీర్ణకోశ వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉండడానికి, రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా ఉండేందుకు బ్యాక్టీరియా వైరస్‌లు తోడ్పడతాయన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్ నిరోధక వారోత్సవాల్లో భాగంగా గురువారం అమలాపురం ప్రతిభ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మైక్రోబ్స్ కొన్ని సమయాల్లో మేలు చేయడమే కాకుండా కీడుచేసి అనారోగ్య హేతువులుగా మారతాయన్నారు. టీకాలు, ఔషధాలకు లొంగకుండా మైక్రోబ్స్ సూపర్ బగ్స్‌గా మారతాయన్నారు. ఈపరిణామాన్నే యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అంటారని వివరించారు. ఏటా 50లక్షల మంది దీని కారణంగా చనిపోతున్నారని వివరించారు. విచక్షణా రహితంగా ఈ మందులు వాడడం వల్ల జరిగే తీవ్ర పరిణామాలను డాక్టర్ మూర్తి వివరించారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో పశువైద్యాధికారులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ మాధురి, డాక్టర్ వాసవిసాయి తదితరులు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఘనంగా మత్స్య దినోత్సవం



మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

యానాం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): యానాంలో గురువారం ప్రపంచమత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అగ్ని కుల క్షత్రియ కల్యాణ మండపంలో సంక్షేమ సేవా సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈసందర్భంగా మల్లాడి కేక్ కట్ చేశారు. యానాంలో చమురు సంస్థల నుంచి పరిహారాన్ని తీసుకువచ్చిన అంశాలను, మత్స్యకారుల చరిత్ర గురించి మల్లాడి వివరించారు. ఈనెల చివరి వారంలో అర్హులైన మత్స్యకారులు 5,520 మందికి రూ.96కోట్ల పరిహారం వారి ఖాతాల్లో జమ అయ్యేల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈసందర్భంగా మత్స్యకారులకు సంబంధించిన పలు అంశాలపై నృత్య ప్రదర్శనలు, నాటికలు నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు శేరు కృష్ణ, మల్లాడి శామ్యూల్, గిడ్ల చంద్రరావు పాల్గొన్నారు.

పెమ్మాడి సుబ్బరాజుకు నివాళి

పి.గన్నవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం అక్విడెక్టు వద్ద నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ, మత్స్యకార సంఘ నాయకుడు పెమ్మాడి సుబ్బరాజు విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో కొల్లు రాంబాబు, పెమ్మాడి మారుతి కృష్ణమోహన్, అర్థాని ఏడుకొండలు, మాల్లాడి గోపి, పొన్న మండ రాముడు, కొల్నాటి వెంకట్రావు, లంకే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1,11,116 విరాళం

అయినవిల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రామారావుపేటకు చెందిన కొప్పిశెట్టి వెంకటరమణ గురువారం శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వరస్వామి అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,11,116 విరాళాన్ని అందజేశారు. దాతకు ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం చేసి, శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందించారు.

గెయిల్ శిక్షణా తరగతులు

మామిడికుదురు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గెయిల్ సంస్థ ద్వారా ఇస్తున్న శిక్షణా తరగతులను నిరుద్యోగులు వినియోగించుకోవాలని గెయిల్ జీఎం కేబీ నారాయణ కోరారు. మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలోగల గెయిల్ శిక్షణ కేంద్రంలో ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ మెకానికల్ కోర్సులకు శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని గెయిల్ అధికారులు తెలిపారు. గెయిల్ అధికారులు సీహెచ్‌కేఎన్వీ కన్నారావు, ప్రభాకర్ దేవి, వైవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

సాంబశివరావుకు యూత్ ఐకాన్ అవార్డు

అమలాపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషనర్ న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి సంగ్రహాలయంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో అమలాపురానికి చెందిన ఎస్ఎస్ఆర్ఎల్టీఎల్ ట్రైనింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో చిక్కం సాంబశివరావు ఇంటర్నేషనల్ యూత్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. ఎకో ఫ్రెండ్లీ కార్యక్రమాలు, పంచ ప్రక్రియ సాధన, భారతీయ సంస్కృతిని విద్యార్థులకు వివరించడం, మానసిక సమస్యల పరిష్కార కౌన్సిలింగ్స్ వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన సాంబశివరావును యూత్ ఐకాన్ అవార్డుకు ఎంపిక చేసినట్టు సంస్థ నిర్వాహకులు ప్రకటించారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ఎంపీపీ కేతా

రాజోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కుడుపూడి సత్తిబాబును గురువారం విజయవాడలో మర్యాద పూర్వకంగా ఎంపీపీ కేతా శ్రీను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా మాట్లాడుతూ ఈనెల22న విజయవాడలో బీసీ భవనంలో చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శెట్టిబలిజ నాయకులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లూటుకుర్రు గ్రామంలో వేంచేసి ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజ గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. భక్త దంపతులు కర్తలుగా పూజలు చేశారు.

కేశవదాసు విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలి

శ్రీకృష్ణ యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు

మలికిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి సాక్షాత్కారం పొందిన వ్యక్తి మందపాటి కేశవదాసు అని, ఆయన శక్తి కొలదీ కర్రలతో ఆలయం నిర్మించి ధూపదీప నైవేద్యాలతో పూజలు చేశారని రాజోలు తాలూకా శ్రీకృష్ణ యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఒక సామాజికవర్గం వనభోజన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం గురించి వాస్తవాలే మాట్లాడారని, స్థల పురాణం ప్రకారం కేశవదాసు, కొపనాతి కృష్ణమ్మల ప్రాశస్త్యం, చరిత్రలను చెప్పారన్నారు. అగ్నికుల క్షత్రియులకు తాము వ్యతిరేకులం కాదని, కేశవదాసు విగ్రహం పెట్టడం వల్ల కొపనాతి కృష్ణమ్మకు ఏమాత్రం ప్రాధాన్యం తగ్గదని, ఆలయ ప్రాంగణంలో మందపాటి కేశవదాసు విగ్రహం ఏర్పాటుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మాట్లా వెంకట్రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మందపాటి నాగేశ్వరరావు, కన్వీనర్ నూని రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ మన్నె రవివరప్రసాద్, మన్నె నూకాలరావు, సూరిమేను శివరామప్రసాద్, నాగళ్ల వెంకటేశ్వరరావు, కానుబోయిన నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం 11కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. దేవగుప్తం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని ఏఈ బి.వెంకటేశ్వరరావు కోరారు.

వారాహి అమ్మవారి విగ్రహావిష్కరణ

అంబాజీపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మాచవరం శివాలయ ప్రాంగణంలో జోగి కృష్ణచైతన్య-వినోదిని, గుత్తుల సురేష్‌కుమార్-లలితా దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మీవారాహి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు మాచరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిపరాశక్తి అమ్మవారి సర్వసైన్యాధికారిగా వెలుగొందుతున్న వారాహి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలనే ఆకాంక్షతో ఆలయాన్ని రూ.లక్షతో నిర్మించామని దాతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, అరిగెల సూరిబాబు, దొమ్మేటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాణేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాణాపురం శ్రీపార్వతీ బాణేశ్వరస్వామి ఆలయంలో గురువారం నల్లా సూర్యప్రకాశరావు, హైమావతి దంపతుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. అఖండ అన్నసమారాధన నిర్వహించారు. రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, రాయపురెడ్డి ధనబాబు, కాకర్లపూడి రాజేష్, రాయపురెడ్డి వెర్రిబాబు, రాయపురెడ్డి స్వామినాయుడు, మల్లిపూడి రాజు, రాయపురెడ్డి బాబి, పిల్లా గోపి, దంగుడుబియ్యం మోహన్‌పాల్గొన్నారు.

చెల్లి అశోక్‌కు సన్మానం

ముమ్మిడివరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చెల్లి అశోక్‌ను ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మతో పాటు పలువురు గురువారం శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సెంటర్‌లో ఉన్న చెల్లి అశోక్ నివాస గృహం వద్ద ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కమిషనర్ వెంట కాకినాడ స్మార్ట్ సిటీ సీడీవో గెడ్డం సాల్మన్ చక్రవర్తి, ముమ్మిడివరం నగర పంచాయతీ మేనేజర్ భాస్కర్, పెట్టా శివ, ఇరిగేషన్ రిటైర్డ్ డీఈ గెడ్డం ఏసుదాసు, జనసేన పార్టీ నాయకులు మోకా బాలప్రసాద్, టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు గొల్లపల్లి గోపి, ప్రసాదరావు పాల్గొన్నారు. టీడీపీ అనాతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు కురసాల శివబాబు ఆధ్వర్యంలో పలువురు అశోక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పెయ్యల వెంకటరమణ, అందే శ్రీను, మట్టపర్తి రాంబాబు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేద్దాం

ఉప్పలగుప్తం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా కార్యక్రమాలు అమలయ్యేలా కృషి చేద్దామంటూ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భీమనపల్లిలో గురువారం జరిగిన ఆర్యవైశ్య కార్తీక వనసమారాధనలో వివిధ ప్రాంతాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామంను అమలాపురం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం కార్యవర్గ సభ్యులు వరదా సూరిబాబు, నందిపాటి శ్రీనివాస్, అప్పన వీరన్న, నూలు కృష్ణ, కూరపాటి మావుళ్లయ్య, యర్రమిల్లి సత్తిబాబు, నూలు శ్రీనివాస్, నూలు వాసు, గోకవరపు దత్తుడు, ఆర్యవైశ్య అసోసియేషన్ సీనియర్ కార్యవర్గ సభ్యులు యర్రమిల్లి విస్సు, నూలు సూర్యప్రభాకరరావు, శ్రీఘాకోళపు రాంపండు, అప్పన హరిశివప్రసాద్, కంకటాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

అంతర్వేది, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మోరి, రామేశ్వరం, వీవీ మెరక గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో డీఈవోడాక్టర్ షేక్ సలీంబాషా గురువారం తనిఖీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షలకు ఎలా సంసిద్ధులు అవుతున్నారని పాఠశాలల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

వాడపల్లి ఆలయంలో
పోటెత్తిన భక్తజనం

• ప్రత్యేక పూజలు, అభిషేకాలు • దర్శనానికి బారులుతీరిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరిస్తున్న భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,05,386 వచ్చిందని ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. కార్తీకమాసానికితోడు గురువారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదంలో పాల్గొన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆయా ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు.

సంఘాలతోనే సమస్యలు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

శాసనమండలి మాజీ వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యలు సంఘాలతోనే పరిష్కరించుకోగలమని శాసనమండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం రామచంద్రపురం ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలో జరిపిన నియోజకవర్గ శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో ఆయన మాట్లాడారు. శెట్టిబలిజగా జన్మించడం వల్లే తనకు శాసనమండలి సభ్యుడిగా, వైస్ చైర్మన్‌గా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా అవ కాశం దక్కిందన్నారు. జిల్లాలో తెలుగుదేశంలో తొలిసారి మంత్రి పదవి సుభాష్‌ను వరించిందన్నారు. శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి సేవలు కొనియాడారు. టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ శెట్టిబలిజ కారణంగానే తన కుమారుడు సుభాష్‌కు ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశం దక్కిందన్నారు. సామాజికవర్గ రుణం తీర్చుకునేందుకు రామచంద్రపురం, అమలాపురంలో కల్యాణ మండపాల నిర్మాణం రెండేళ్లలోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్ కాద వెంకట రమణ, చొల్లంగి వేణుగోపాల్ మాట్లాడారు. డాక్టర్ యనమదల మురళీకృష్ణ, డాక్టర్ కోట సతీష్‌కుమార్, డాక్టర్ పెంకె ఆనందభాస్కర్, ఎ.రాజేష్ పాల్గొన్నారు. సమావేశంలో అతిథులను సత్కరించారు. నిర్వాహకులను రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు సత్కరించారు. శెట్టిబలిజ సంఘ నాయకులు దొంగల శ్రీధర్, దంగేటి గౌరీశంకర్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో శెట్టిబలిజ సంఘీయులు కార్తీక వనసమారాధనకు హాజరయ్యారు.

ఘనంగా గణపతి హోమం, అయ్యప్పస్వామి గ్రామోత్సవం


అంగరలో గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

కపిలేశ్వరపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో గురువారం గణపతి హోమం, అయ్యప్పస్వామి గ్రామోత్సవ జరిపారు. గ్రామానికి చెందిన తోరాటి శ్రీనివాస్, సత్యజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో కోరుమిల్లికి చెందిన వేద పండితులు ముక్కామల కామేశ్వర స్వామి పర్యవేక్షణలో గణపతి హోమంతో పాటు పలు పూజలు చేశారు. అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చెముడులంకలో అయ్యప్ప పడిపూజ జరుపుతున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో అయ్యప్పపడిపూజ

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంకలో బుధవారం రాత్రి జరిగిన అయ్యప్ప పడిపూజను భక్తి శ్రద్ధలతో జరిపారు. అయ్యప్ప భక్తుల శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. గురుస్వామి గారపాటి శివన్నారాయణ గురుస్వామి పీఠం వద్ద జరిగిన పడిపూజలో లంక గ్రామాల అయ్యప్ప భక్తులతోపాటు పలు గ్రామాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప పడిపూజ, శరణుఘోష, అయ్యప్పస్వామి భక్తి గీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది. పడిపూజను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గురువారం రాయవరం గ్రంథాలయంలో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో-2 వై.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిరోజు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా పేర్కొన్నారు. విద్యార్థులకు జరిపిన వ్యాసరచన తదితర పోటీల్లో విజేతలకు ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్.రత్నాబాయ్, ఉపాధ్యాయులు రామారెడ్డి, ఎల్.వెంకటరమణ, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


రాయవరంలో విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

గోతులు తీశారు...స్తంభాలు మరిచారు

• పొంచి వున్న ప్రమాదం • చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


ర్యాలిలో మూలనపడి ఉన్న విద్యుత్ స్తంభాలు. (ఇన్‌సెట్‌లో) ర్యాలి వంతెన నుంచి అంకంపాలెం వంతెన వరకు మధ్యలో గోతులుతీసి వదిలేసిన దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లకు తీసిన గోతులు అలానే దర్శనమిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు సైతం రోడ్డు పక్కనే వదలేశారు. కొన్ని నెలల నుంచి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయకపోగా తీసిన గోతులను సైతం పూడ్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో కాలినడకన వెళ్లే విద్యార్థులు, పాదచారులు, వాహనదారులకు ప్రమాదం పొంచి వుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో హెవీలైన్ల కోసం ర్యాలి వంతెన నుంచి అంకంపాలెం వంతెన వరకు విద్యుత్ స్తంభాలు నిర్మించాల్సి ఉంది. దీని క్రాంటాక్టరు రోడ్డు పక్కనే పెద్ద గోతులుతీసి వదిలేశారు. విద్యుత్ స్తంభాలను కూడా రోడ్డుపక్కనే వదిలిపెట్టారు. రాత్రి సమయంలో వీటి కోసం తీసిన గోతుల్లో ఎవరైనా పడిపోతారంటూ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. విద్యుత్ లైన్లు వేయకపోతే కనీసం గోతులు పూడ్చాలంటూ స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

సోమేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

ద్రాక్షారామ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలోనున్న సోమేశ్వర, వేణుగోపాలస్వామివార్ల ఆలయ హుండీ లెక్కించగా రూ.55,359 వచ్చింది. గురువారం దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్ ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో ఎం.వి.వి సత్యనారాయణ, సిబ్బంది హుండీని లెక్కించారు.


జొన్నాడలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలతో
అదనపు ఆదాయం

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను సక్రమంగా నిర్వహించడం వల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా నిర్వహించడం వల్ల చెత్త సమస్య పరిష్కారంతోపాటు ఆదాయం వస్తుందన్నారు. వీటిని సిబ్బంది సక్రమంగా నిర్వహించేలా గ్రామాల్లోని పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో కోరారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో గంటి గ్రామానికి చెందిన వ్యక్తిని 13 మద్యం బాటిల్స్‌తో అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్టు గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

రిజర్వేషన్‌లో ఎస్సీలకు
అన్యాయం


చెముడులంక పంచాయతీ రిజర్వేషన్‌ను ఎస్సీలకు కేటాయించాలని వినతిపత్రం ఇస్తున్న కొత్తియ్య

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లు అమలైనప్పటి నుంచి ఇప్పటి వరకు చెముడులంక పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ పదవులు ఎస్సీలకు రిజర్వు కాలేదని కొత్తపేట నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు గుర్రపు కొత్తియ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరులో గురువారం తహశీల్దార్, ఎంపీడీవోలతోపాటు పలువురు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. చెముడులంకలో 30 ఏళ్లుగా ఎస్సీలకు సర్పంచ్ పదవి రిజర్వు కాకుండా అధికారులు అన్యాయం చేస్తున్నారని ఆయన అన్నారు. అధికారులు గుర్తించి ఎస్సీ వర్గానికి న్యాయం చేయాలని ఆయన కోరారు.


ఆత్రేయపురం మండలం పులిదిండి ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఇసుక ర్యాంపులను పరిశీలించిన ఆర్డీవో

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఉచిత ఇసుక పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆత్రేయపురం పులిదిండి, నార్కెడిమిల్లి ఇసుక ర్యాంపులను ఆయన పరిశీలించారు. ఈయన వెంట తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్ఐ ఎస్.రాము, ఎంపీడీవో రామన్, డిప్యూటీ తహశీల్దారు శ్రీరామచంద్రమూర్తి, ఆర్ఐ భాను, గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు. అనంతరం అధికారులకు విధి విధానాలపై పలు సూచనలు చేశారు. టెండర్లు పూర్తి కావడంతో తవ్వకాలు ప్రారంభించాలని ఆయన సూచించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): ఆధార్ కార్డులను సరి చేసుకోవడానికి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు కోరారు. ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో ఆధార్ కార్డుల మార్పు, కొత్త కార్డులు వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అందుబాటులోకి ఆధార్ కేంద్రాలు వచ్చాయన్నారు. వీటిని ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని ఆయన కోరారు.


మూలస్థానంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

ప్రతి ఒక్కరూ మంచిని
అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న ఆధ్యాత్మిక సాధకుడు మంజునాథ్

రావులపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కలియుగం నుంచి సత్యయుగం వైపు నడవడానికి ప్రతి ఒక్కరూ మంచిని అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక సాధకుడు బీకే మంజునాథ్ అన్నారు. రావులపాలెం బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆశ్రమ ఇన్‌చార్జ్ బీకే భవాని ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీక స్నేహమిలన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంజునాథ్ పాల్గొని మాట్లాడారు. ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, దాని విశిష్టత తెలిపారు. మంచివైపు నడవడానికి ధ్యానం ఎంతో దోహదపడుతుందన్నారు. సమాజంలో మీడియా పాత్ర చాలా కీలకమైనదని ఆయన అన్నారు. చెడు జరుగుతుంటే మీడియా దానినే చూపించాల్సి వస్తున్నదని తెలిపారు. మంచి జరిగితే కూడా మీడియా దానినే చూపిస్తున్నదని మారాల్సింది మనం, సమాజమన్నారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం 88 ఏళ్ళ క్రితం ఆవిర్భవించిందని ఆయన అన్నారు.

ఇసుక ర్యాంపు పరిశీలన

రావులపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం ఊబలంక ఇసుక ర్యాంపులో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం ఆర్డీవో శ్రీకర్, తహశీల్దారు ముక్తేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ర్యాంపులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలయ్యే విధానంపై అధికారులతో చర్చించారు.


ఊబలంక ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్, అధికారులు

అంగరలో
కంటివైద్య శిబిరం


అంగరలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సత్యనారాయణ

కపిలేశ్వరపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీ ఆవరణలోని నూతన భవనంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ 21 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో ముగ్గురికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సకు, 15 మందికి కళ్ళజోళ్ళు అవసరాన్ని గుర్తించారు. త్వరలో ఏరియా ఆసుపత్రిలో వారికి కాటరాక్ట్ ఆపరేషన్లు చేయించి ఉచితంగా కళ్ళజోళ్ళు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి, ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, హెచ్‌వీ మేరీమణి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

రావులపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం జరిపారు. ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్ సుభాషిణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. విద్యార్థులు సన్మార్గంలో నడిచేలా అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు సత్యమూర్తి, వరప్రసాద్, రమేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు
ఉచిత దంత పరీక్షలు


వాసాలరేవులో దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ క్రాంతి కుమార్

కె.గంగవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దంగేరు శివారు వాసాలరేవులో మత్స్యకార కుటుంబాలకు ఉచిత దంత వైద్య శిబిరం జరిపారు. ద్రాక్షారామలోని భీమేశ్వర దంత వైద్యశాల డాక్టర్ బి.క్రాంతి కుమార్ దీన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని మత్స్యకార కుటంబాలకు దంత పరీక్షలు చేశారు. శిబిరంలో ఉచితంగా మందులు, టూత్ పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


గుమ్మిలేరులో మేలుజాతి దున్నలను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

మేలుజాతి పశువృద్ధికి సెమన్ బ్యాంక్ దోహదం

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మేలుజాతి పశు అభివృద్ధికి సెమన్ బ్యాంక్ ఎంతో దోహదపడుతుందని జిల్లా పశువైద్యాధికారి కె.వెంకట్రావు అన్నారు. జిల్లాలో జరుగుతున్న పశుగణన పరిశీలనకు ఆలమూరు మండలం గుమ్మిలేరు, మోదుకూరు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గుమ్మిలేరులోని సెమన్ బ్యాంక్‌ను పరిశీలించారు. మేలుజాతి దున్నలను ఆయన పరిశీలించి వివరాలను సెమన్ బ్యాంక్ అధినేత కోరా సత్యవేణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ గ్రామాలలో పశుగణన వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏడీ అనిత, పలువురు పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాణేశ్వరస్వామి ఆలయంలో
లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాణాపురం శ్రీపార్వతీ బాణేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం నల్లా సూర్యప్రకాశరావు, హైమావతి దంపతుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన జరిగింది. అఖండ అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు లక్ష బిల్వార్చనలో పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థికసాయం

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శివారు పెదరాముని నూతిమెరకకు చెందిన దంగేటి శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఒక ఏడాది మెరుగైన చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. అతని ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రావులపాలెం శ్రీరామ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.85వేలు ఆర్థికసాయం గురువారం యువకుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గారపాటి అయ్యప్పస్వామి, అవినాస్ చౌదరి, రమేష్, ర్యాలి నాగబాబు, మందపల్లి దుర్గాప్రసాద్, జంపన రాంబాబు, కొమరాజులంక నాగు తదితరులు పాల్గొన్నారు.


గాయపడిన యువకుడి కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది